సాక్షి పల్నాడు

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



మళ్లీ పెరిగిన పులిచింతల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,10,854 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. నాలుగు గేట్లు ఎత్తి 1,10,854 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



వరద తగ్గుముఖం

కొల్లూరు:వరద తగ్గుముఖం పట్టడంతో కృష్ణా పరివాహక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఆదివారం భారీగా వరదలొచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



రేషన్ బియ్యం వరదపాలు

కొల్లూరు: వరద ప్రభావిత లంక గ్రామాలలో వరదల్లో రేషన్ బియ్యం తడిచిపోయి బూజు పట్టి భరించలేని దుర్గంధం వెదజల్లుతూ పాడయ్యాయి. వేమూరు గోడౌన్‌కు తరలించారు.

న్యూస్‌రీల్

రూ.7.10 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



రెంటచింతల: రెంటచింతల ఆనంద్‌పేట కాలనీలో వినాయకుడి వద్ద ఉంచిన 80 కిలోల స్వామి వారి లడ్డూ, 25 గ్రాముల స్వామి వారి బంగారు లాకెట్‌కు సోమవారం రాత్రి జరిగిన వేలంలో రూ.7.10 లక్షలకు భక్తుడు గొంటు ఆదిరెడ్డి దక్కించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు గణపతితో ఊరేగింపు కొనసాగిస్తూ రూ.1.65 లక్షల విలువైన బాణసంచా కాలుస్తూ ప్రధాన రహదారిపై యువత కేరింతలు పెట్టారు.

నీట మునిగిన పత్తి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



పెదకూరపాడు: భారీ వర్షాలకు, వరదలకు నీట మునిగిన పత్తి పంటలను ఏరువాక శాస్త్రవేత్త వెంకటరాములు, లాం ఫాం సీనియర్ శాస్త్రవేత్త అమరజ్యోతిల బృందం సోమవారం పరిశీలించింది. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వేరు కుళ్లకుండా ఉండేందుకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు, లీటరు నీటిలో కలిపి మొక్క పాదు తడిచేలా పోయాలన్నారు. నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. 13-0-45 10 గ్రాములు, 19-19-19 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వారి వెంట వ్యవసాయశాఖాధికారి శాంతి, హసన్ పాల్గొన్నారు.

జిల్లాలో 196.0 మి.మీ. వర్షపాతం నమోదు

బొల్లాపల్లిలో అత్యధికం

నరసరావుపేట: వాయుగుండం ప్రభావంతో గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు గడిచిన 24గంటల వ్యవధిలో 28మండలాల్లో 196.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని అధికారులు సోమవారం తెలియచేశారు. అత్యధికంగా బొల్లాపల్లిలో 19.6 మి.మీ వర్షం కురిసిందన్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే... నరసరావుపేటలో 4.6, మాచర్లలో 3.2, వెల్దుర్తిలో 8.2, దుర్గిలో 2.6, రెంటచింతలలో 6.2, గురజాలలో 3.8, దాచేపల్లిలో 4.0, కారెంపూడిలో 9.6, పిడుగురాళ్లలో 3.6, మాచవరంలో 1.4, బెల్లంకొండలో 13.2, అచ్చంపేటలో 3.6, క్రోసూరులో 5.4, అమరావతిలో 6.4, పెదకూరపాడులో 10.0, సత్తెనపల్లిలో 16.6, రాజుపాలెంలో 14.4, నకరికల్లులో 4.8, వినుకొండలో 6.2, నూజెండ్లలో 0.8, శావల్యాపురంలో 6.8, ఈపూరులో 7.2. రొంపిచర్లలో 10.2, ముప్పాళ్లలో 13.8, నాదెండ్లలో 2.2, చిలకలూరిపేటలో 4.2, యడ్లపాడులో 3.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని వెల్లడించారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు: పవిత్ర అరుణాచల గిరి ప్రదక్షిణను పురస్కరించుకుని, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో- 2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న బస్సు బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, ఆ రోజు రాత్రి అక్కడే ఉండి, 18న గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం అనంతరం సాయంత్రం తిరిగి గుంటూరుకు బయలుదేరి 19న ఉదయానికి చేరుకుంటుందని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకుని అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కో టికెట్ ధర రూ 2,420 మాత్రమేనని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 7382894613కు సంప్రదించాలని సూచించారు.

లైంగికదాడి కేసులో పాస్టర్‌కు 20 ఏళ్లు జైలు

నగరంపాలెం: మైనర్‌పై లైంగికదాడికి ఒడిగట్టి గర్భవతి చేసిన పాస్టర్‌కు ఇరవై ఏళ్లు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు, ఐదో అదనపు జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి చెందిన ఎన్.కోటేశ్వరరావు (55)చర్చి నిర్వహించేవారు. 2018లో 15 ఏళ్ల బాలికతో కోటేశ్వరరావు అసభ్యంగా ప్రవర్తించి, బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలికకు నెలసరి సక్రమంగా రాకపోవడంతో తల్లిదండ్రులు విజయవాడలోని పాత ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి గర్భవతిగా నిర్ధారించారు. తల్లిదండ్రులు పాస్టర్‌పై తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ సీహెచ్.రవి బాబు కేసు దర్యాప్తు చేపట్టి, పాస్టర్‌ను అరెస్ట్ చేశారు. నేరం రుజువుకావడంతో శిక్ష విధించారు.

వీడని ముప్పు



పెదకూరపాడు మండలం పాటిబండ్ల గ్రామంలో నీట మునిగిన పత్తి పంట

- మళ్లీ పెరుగుతున్న కృష్ణా నది వరద
- అమరావతి వద్ద 4 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- మళ్లీ పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు
- నదిలో నీరు ఎగతన్నడంతో వంకలు, వాగుల్లో తగ్గని నీటి పరిమాణం
- రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు
- వర్షాలతో పంటలకు ముప్పు తప్పదంటున్న రైతులు

సాక్షి, నరసరావుపేట: గత నెల చివర్లో మొదలైన కష్టాలు కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలను వీడటం లేదు. శనివారం, ఆదివారం మళ్లీ జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షాలు పడటంతో రైతులకు కంటిమీద కునుకు కరువైంది. శనివారం జిల్లా వ్యాప్తంగా 262.8 మిమీ, ఆదివారం 196 మిమీ వర్షపాతం నమోదైంది. ఇప్పటికే పొలాల్లో నిలిచిన వరద నీరు పూర్తిగా ఇంకలేదు. కొన్ని పొలాల్లో ఇంకా అడుగుమేర నీరు ఉండగా, మరికొన్ని పొలాలు బురదమైపోయాయి. మళ్లీ వర్షాలు పడుతుండటంతో పొలాల్లో నీరు తగ్గడం లేదు. పత్తి, మిరప మొక్కలు కాండం కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే మూడు నాలుగు రోజులు నీట మునిగి ఎండిపోయి చనిపోతున్న దృశ్యాలు అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, క్రోసూరు మండలాల్లో కనిపిస్తున్నాయి. వరద నీరు పొలాల నుంచి బయటకు పోయే మార్గం లేదు. మురుగునీరు ఇలానే కొన్ని రోజులు ఉంటే మొక్కలు కుళ్లిపోతాయని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యమే పంట పొలాల మునకకు కారణమైందని వారు ఆరోపిస్తున్నారు. సకాలంలో డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతోనే ఈ స్థితికి కారణమైందని రైతులు చెబుతున్నారు. ముంపు బారిన పడిన పత్తి, మిర్చి పొలాలను సందర్శించిన వ్యవసాయాధికారులు సూచనలతో కాలం వెళ్లదీస్తున్నా రని రైతులు అంటున్నారు. పొలంలో నీరు వెళ్లాక చేయాల్సిన జాగ్రత్తలు తెలియచేస్తున్నారు కానీ, వరద నీరు వెళ్లే మార్గం చూపడం లేదని వాపోతున్నారు.

ఫ్లాష్ ఫ్లడ్స్‌తో వణుకు

కృష్ణానదికి వస్తున్న ఫ్లాష్ ఫ్లడ్స్‌తో నది పరివాహక ప్రజలు వణికిపోతున్నారు. గత నెల 30, 31వ తేదీల్లో కురిసిన వర్షాలు, పై నుంచి వస్తున్న వరదకు కృష్ణానది ఒకదశలో 11 లక్షల క్యూసెక్కులకు పైగా ప్రవాహం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ముఖ్యంగా అమరావతి టౌన్‌లో పలు కాలనీలు జలమయమయ్యాయి. నదిలో ఒక్కసారిగా వరద రావడంతో ప్రజలు, పశువులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే సమయం లేకుండా పోయింది. వరద సుమారు లక్ష క్యూసెక్కులకు తగ్గుముఖం పట్టి ప్రజలు ఊపిరిపీల్చుకునేలోపే ఆదివారం నుంచి మళ్లీ కృష్ణానదిలో ప్రవాహం 4 లక్షల క్యూసెక్కులకు ఒక్కసారిగా చేరడంతో ప్రజల్లో మళ్లీ భయాందోళనలు మొదలయ్యాయి. అనుకోకుండా ఒక్కసారిగా నదిలో ప్రవాహం పెరుగుతుండటంతో అమరావతి మండల పరిధిలోని లోతట్టు గ్రామాల ప్రజలను తిరిగి పునరావాస కేంద్రాలకు రమ్మని అధికారులు పిలుపునిస్తున్నారు. ప్రజలు మాత్రం పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. లంక గ్రామాల్లో నీరు ప్రమాదకరస్థాయిలోనే ఉండటంతో వారు కేంద్రాలలోనే తలదాచుకుంటున్నారు. నదిలో నీరు ఎగతన్నడంతో వాగుల్లో నీరు ప్రమాదకర స్థాయిలోనే ఉంటున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, పొలాల్లో నీరు తగ్గడంలేదు.

భయం భయంగా గడుపుతున్నాం



కృష్ణానదికి పై నుంచి వస్తున్న వరద, భారీ వర్షాలతో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరుగుతోంది. గత వారం 8,9 లక్షలు క్యూసెక్కుల దాకా ప్రవాహం ఉండి తగ్గిపోయింది. ఊపిరిపీల్చుకునేలోపే ఆదివారం మళ్లీ 3,4 లక్షల క్యూసెక్కుల దాకా ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. దీంతో నీరు గ్రామంలోని లోతట్టు ఇళ్లు మునగడంతోపాటు మేతకు వెళ్లిన పశువులు, పశువుల కాపరులు నీటిలో చిక్కుకుపోతున్నారు. రోజు భయం భయంగా గడుపుతున్నాం.

–నారుమళ్ల రామకోటి, ఎమ్మాజిగూడెం, బెల్లంకొండ మండలం

అర్జీలకు త్వరగా పరిష్కారం చూపండి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- ప్రజాసమస్యల వేదికలో 50 అర్జీలు స్వీకరణ



కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లోని బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 50 మంది అర్జీలు స్వీకరించారు. అధికారులు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలోగా నిబంధనల ప్రకారం పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, జిల్లా అధికారులు, డీఎల్డీవోలు పాల్గొన్నారు.

ఆస్తి కాజేసి అమ్మకు అన్నం పెట్టడంలేదు

నా సోదరుడు 80 ఏళ్లకు పైగా ఉన్న మా అమ్మ అనంతమ్మకు చెందిన 1.5ఎకరాల పొలం, రూ.10లక్షల నగదు, 15 సవర్ల బంగారు వస్తువులు తీసుకొని తిండి పెట్టకుండా వేధిస్తున్నాడు. అమ్మకు అన్నమైనా పెట్టించండి లేదా ఆమె ఆస్తినైనా ఇప్పించండి.

-కె.శ్రీనివాసరావు, నెమలిపురి, రాజుపాలెం మండలం

పింఛన్ మంజూరు చేయండి

మూడున్నరేళ్ల కిందట గ్రామంలో పొలం పనులు చేస్తుండగా విద్యుత్ వైరు తెగి మీద పడి తలకు, శరీరం కాలి తీవ్ర గాయాలయ్యాయి. దేవుడి దయతో బతికి బయటపడ్డా. అయితే ఏ పని నేను చేసుకోలేకుండా ఉన్నా. దయచేసి నాకు నెలవారీ సామాజిక పింఛన్ మంజూరు చేయించండి.

-జొన్నలగడ్డ పిచ్చయ్య, శావల్యాపురం

విపత్తు సమయంలో చురుగ్గా వ్యవహరించాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ, అధికారులు

నరసరావుపేట: ప్రకృతి విపత్తులు నెలకొన్నప్పుడు క్షేత్రస్థాయిలో ఉండే గ్రామ-వార్డు సచివాలయాల సిబ్బంది చురుగ్గా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరైన జిల్లా అధికారులను ఉద్దేశించి ప్రత్యేకంగా మాట్లాడారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే రాబోయే ప్రమాదాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసిన గ్రామాల్లో ప్రజాసమస్యలపై స్పందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు సచివాలయాలను తనిఖీచేసి సిబ్బంది కార్యాలయ విధుల్లో క్రమం తప్పకుండా హాజరై, ప్రతిరోజూ మూడు పూటలా అటెండెన్స్ వేసేలా చూడాలని ఆదేశించారు. రానున్న రెండు రోజులూ వర్ష సూచనలున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని, వర్షం-వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితిని మండల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, సీడీపీవో పీడీ ఉమారాణి, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ పాల్గొన్నారు.



కరెన్సీ వినాయకుడు

పాలపాడురోడ్డులోని సాయిూస్ గ్రీన్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన పందిరిలోని వినాయకుడిని దాదాపు రూ.18 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. – నరసరావుపేట ఈస్ట్

వృద్ధ దంపతులపై దాడి

- కొడవలితో దాడి చేసి బంగారం లాక్కెళ్లిన దుండగుడు
- ప్రతిఘటించిన వృద్ధునికి తీవ్ర గాయాలు



బాధితుల ఇంట్లో విచారణ చేస్తున్న సీఐలు సురేష్, బాలాజీ, ఎస్ఐ రాజా



చికిత్స పొందుతున్న బాధితుడు

బెల్లంకొండ: అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధ దంపతులపై గుర్తుతెలియని దుండగులు కొడవలితో దాడి చేసి వృద్ధురాలి మెడలో ఉన్న బంగారం లాక్కెళ్లిన ఘటన బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ ఎం.రాజా తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బండారు గోవిందులు, అనసూయమ్మ ఇంట్లో నిద్రిస్తున్నారు. ఆదివారం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఒక వ్యక్తి వచ్చి గట్టిగా తలుపులు కొట్టడంతో అనసూయమ్మ వెళ్లి తలుపులు తెరిచింది. ఒంటినిండా ముసుగు వేసుకొని, ముఖానికి నల్లని మాస్క్ ధరించిన వ్యక్తి కొడవలి చూపించి, గొంతు పట్టుకున్నాడు. మెడలో ఉన్న బంగారు గొలుసు ఇవ్వాలని లేకుంటే గొంతు కోస్తా అంటూ బెదిరించాడు. భయపడిన అనసూయమ్మ దొంగ వచ్చాడు... అంటూ గట్టిగా అరవడంతో, భర్త గోవిందులు వచ్చి ఎవరు అంటూ... గట్టిగా అరిచాడు. దుండగుడు వెంటనే అనసూయమ్మ మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కున్నాడు. దీంతో ఆ వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించిన భర్త గోవిందులపై దుండగుడు కొడవలితో దాడి చేశాడు. దాడిలో రెండు చేతుల వేళ్ల మధ్యలో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే దుండగుడు భార్యాభర్తలను నెట్టేసి ఇంట్లోంచి బంగారం తీసుకుని పారిపోయాడు. కింద పడిపోయిన అనసూయమ్మ లేచి వేగంగా బయటకు వచ్చింది. ఇంటికి 20 మీటర్ల దూరంలో రోడ్డుమీద మరో వ్యక్తి బైక్‌పై ఉండడం గమనించింది. దాడి చేసిన దుండగుడు ఆ బైక్ ఎక్కి బెల్లంకొండ అడ్డరోడ్డు వైపు వెళ్లినట్లు తెలిపింది. విషయం తెలుసుకున్న బాధితుల బంధువులు, ఇరుగు పొరుగువారు చేరుకుని వెంటనే పోలీసులు సమాచారం ఇచ్చారు. గాయపడిన గోవిందులు సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని సోమవారం క్రైమ్ సీఐ బాలాజీ, పెదకూరపాడు సీఐ సురేష్, ఎస్ఐ రాజాతో కలిసి పరిశీలించారు. బాధితుల ఇంటికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను, నిందితుల ఆధారాల కోసం పరిశీలించారు.

ఉపాధి లేక...పూట గడవక..

- వ్యవసాయ పనులు లేక అవస్థలు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- అసంఘటిత కార్మికులపై వర్షం ప్రభావం
- ఉపాధి పనులు అంతంతమాత్రమే...
- రోజువారి కూలీల అగచాట్లు



పొడపాడు గ్రామంలో పనులు లేక ఇంటి వద్దనే నిరీక్షిస్తున్న కూలీలు

పెదకూరపాడు: రెక్కాడితే కానీ డొక్కాడని కూలీలు ఉపాధి లేక, పూట గడవక అవస్థలు పడుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు జలమయమయ్యాయి. పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ పనులు లేకపోడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. అసంఘటిత, భవన నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారు. ఉపాధి హామీ పనులు అంతంతమాత్రంగానే ఉండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రతి నెలా కట్టాల్సిన డ్వాక్రా రుణాలు, వారం వారం చెల్లించాల్సిన అప్పులు చెల్లించలేక కన్నీరు పెడుతున్నారు.

పంటలు నీటిలో...కూలీలు ఇంట్లో..

పల్నాడు జిల్లాలో వ్యాప్తంగా 5.5 లక్షలకుపైగా వ్యవసాయ కూలీలు ఉన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా ఆశించిన స్థాయిలో వ్యవసాయ కూలీలకు పనులు లేవు. మిరప సాగు ఇంకా ప్రారంభం కాలేదు. పత్తి, వరి మాత్రమే ప్రస్తుతం సాగులోఉంది. అడపాదడప పనులకు వెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 10 రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దొరికే కొద్దిపాటి పనులు కూడా లేకపోవడంతో ఇళ్ల వద్దనే ఉంటున్నారు. రోజువారీ పనులు చేసుకుంటేనే కుటుంబ పోషణ. పనులు లేకపోవడంతో పూటగడవడం కష్టంగా మారింది.

అసంఘటిత కార్మికులపైనా వర్ష ప్రభావం

పల్నాడు జిల్లా వ్యాప్తంగా అసంఘటిత కార్మికులు 1.80 వేల మంది ఉన్నారు. భవన నిర్మాణ కార్మికులు లక్షకు పైగా ఉన్నారు. వీరంతా రోజువారి కూలీలే. వర్షాలకు ఇంటి నిర్మాణాలు, పెయింటింగ్ ఇతర పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ రంగంలో ఉపాధి పొందే కార్మికులంతా ఇళ్లకే పరిమితమయ్యారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసి పొట్ట నింపుకునే వారు అనేక మంది ఉన్నారు. వర్షాలకు వ్యాపారాలు దెబ్బతినడంతో ఆదాయం కోల్పోయి అవస్థలు పడుతున్నారు.

రుణాలు చెల్లించేందుకు అవస్థలు

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది కూలీలు డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా ఉన్నారు. ఉపాధి దెబ్బతినడంతో రుణాలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరికొంతమంది చిన్న మొత్తంలో అప్పులు తీసుకుని అవసరాలు తీర్చుకుంటారు. ప్రతిరోజూ పనులకు వెళ్లి వాటిలో కొంత కుటుంబబపోషణకు, మరికొంత రుణాలు చెల్లిస్తారు. పనులు లేకపోవడంతో అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నారు.

కడుపు నింపని 'ఉపాధి'

వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ప్రస్తుత సమయంలో కడుపు నింపడం లేదు. జిల్లా వ్యాప్తంగా 3.25 లక్షల మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. జాబ్ కార్డు ఉన్న వారికే ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ, అసంఘటిత కార్మికులు పనులు లేక ఇళ్ల వద్దనే ఉంటున్నారు. ఉపాధి పనులకు వెళదామంటే జాబ్ కార్డు లేక ఇబ్బంది పడుతున్నారు. సోమవారం 10,221 మంది మాత్రమే పనులు చేశారు. గణంకాలు బట్టి ఉపాధి హామీ పథకం ఎలా పనిచేస్తుందో చెప్పవచ్చు.

పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం



వ్యవసాయ పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వర్షాలకు వ్యవసాయ పనులు లేవు. కుటుంబ పోషణ భారంగా మారింది. ఇళ్లకే పరిమితమయ్యాం. ఉపాధి హామీ పనులు కూడా లేవు. రుణాలు చెల్లించలేక, పూట గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– దాసరి తంబీజోసఫ్, పొడపాడు

పెయింటింగ్ పనులు అంతంత మాత్రమే



వర్షాలకు పెయింటింగ్ పనులు సక్రమంగా జరగడం లేదు. ప్రతిరోజూ గుంటూరు వెళ్లే వాళ్లం. 10 రోజులుగా పనులు లేవు. చేసేదేమీ లేక ఇంటి వద్దనే ఉంటున్నా. పూట గడవడం లేదు.

– బొంతా పరమేశ్వరరావు, పెయింటర్, పెదకూరపాడు.

వ్యవసాయ పనులు లేవు.



వర్షాలకు పొలాల్లో నీరు చేరింది. పొలాలు ఆరాలంటే మరో 15 రోజులు పడుతుంది. వ్యవసాయ పనులు లేవు. అప్పులు దొరకడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. కూలికి వెళితేనే పూట గడిచేది. ఉపాధి పనులు కూడా లేవు. ప్రభుత్వమే ఆదుకోవాలి

-పిల్లి జయకుమారి

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఇరువురు ఎంపిక



సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురి విద్యార్థులు ఎంపికయ్యారు. గుంటూరు ఎన్జీవో హోంలో ఈనెల 8న ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి సునేంద్ర, షేక్ బాలసైదాలు ఎంపికయ్యారు. ఈనెల 14,15,16 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.కుమారశాస్త్రి సోమవారం తెలిపారు.

క్లుప్తంగా

జిల్లాలో 100 చెరువులను అభివృద్ధి చేస్తున్నాం

- పంచాయతీలకు చెక్కుల పంపిణీలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- జిల్లాలో 15 పంచాయతీలకు చెక్కులు అందజేత



నరసరావుపేట: పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో సాగర్ కుడికాలువకు సంబంధంలేని సుమారు 100 చెరువులను, కాలువలను పైపుల ద్వారా నీటితో నింపి భూగర్భ జలాలను అభివృద్ధి చేయనున్నామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జనసేన కార్యాలయంలో జిల్లాలో వరదలకు గురైన పంచాయతీలకి పవన్ కల్యాణ్ అందజేసిన రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీవం ఉండాలంటే నీరుండాలని, అందుకుగాను చెరువులను బాగుచేసేందుకు ఒక ప్రణాళిక అనుసరించి అభివృద్ధి చేయనున్నామన్నారు. దీనికోసం 100 చెరువులను గుర్తించినట్లు చెప్పారు. నరసరావుపేట పట్టణ శివారు వల్లప్పచెరువు నుంచి తాగునీరు తీసుకునే పరిస్థితి లేదన్నారు. పల్నాడులో కొన్ని ప్రాంతాల్లో నీటి కరువు ఉందన్నారు. నీటి వనరులు అభివృద్ధికి ప్రజలు దృష్టి సారించాలని కోరారు. బొల్లాపల్లిలో రిజర్వాయర్ చేపడితే రాయలసీమకు కూడా నీరు అందజేయవచ్చన్నారు. గ్రామాలకు ఆర్థిక సహాయం చేయటం ద్వారా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జనసేన రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పవన్ కల్యాణ్ వరద పీడిత గ్రామాలు 400 ఎంపిక చేశారని, అందులో జిల్లాలోని 15 గ్రామాలు పల్నాడు ప్రాంతంలో గుర్తించి చెక్కులు అందజేస్తున్నారన్నారు. ఆ నిధులను గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. జనసేన నాయకులు పీవీ ప్రసాదు, షేక్ ఆద్రూఫ్, పలు నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

దుర్గి: నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయం దర్శనానికి వచ్చి ఆదివారం ఉదయం 11 గంటలకు గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. బాపట్ల జిల్లా చీరాల మండలం గవినివారిపాలేనికి చెందిన మిండా బాలు (21) కుటుంబ సభ్యులతో అమ్మవారి దర్శనానికి వచ్చాడు. నాగార్జునసాగర్ కాలువలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. సోమవారం జూలకల్లు లాకుల వద్ద మృతదేహం లభ్యమైంది. యువకుని ఆచూకీ కోసం స్థానిక ఎస్‌ఐ వై.సుధీర్‌కుమార్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది కొన్ని రోజులుగా గజ ఈతగాళ్లతో తీవ్రంగా గాలించారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతుడు బాలు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

కష్టాలు తీరేదెన్నడో!

ప్రమాదభరితంగా పెదమద్దూరు వాగు వంతెన

- వాగు పొంగితే రాకపోకలు బంద్
- నత్తనడకన హైలెవల్ వంతెన పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అమరావతి: పెద మద్దూరు వాగుపై ఉన్న లో లెవల్ వంతెనపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడుతున్నారు. పది గ్రామాల ప్రజలకు ఈ వంతెన ఏకైక మార్గం. వంతెన శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి వర్షం కురిసినా వాగు పొంగి పొర్లుతుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మద్దూరువాగు పొంగితే అమరావతి–విజయవాడ మధ్య రాకపోకలు నిలిచిపోతుంటాయి. ప్రతి ఏటా జూన్ మొదలుకుని సెప్టెంబరు వరకూ ఇదే పరిస్థితి. వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

శిథిలావస్థలో వంతెన

మండల పరిధిలోని పెదమద్దూరు గ్రామ శివారులో విజయవాడ రోడ్డులో వాగుపై సుమారు ఎనభై ఏళ్ల కిందట వంతెన నిర్మించారు. వంతెన ప్రస్తుతం శిథిలమై ప్రమాదకరస్థితిలో ఉంది. ప్రతి నిత్యం అమరావతి నుంచి విజయవాడ, మంగళగిరి వెళ్లే భారీ వాహనాలు, పొలాలకు వెళ్లే ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వైకుంఠపురం, వడ్డమాను, పెదమద్దూరు, అనంతవరం, తుళ్లూరు, హరిశ్చంద్రపురం గ్రామాల ప్రజలు అమరావతి రావాలంటే ఈ వంతెనపై నుండే రావాల్సి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

12కిలో మీటర్లు ప్రయాణించాల్సిందే...

వాగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రమాద నివారణ చర్యలలో భాగంగా పోలీసులు రాకపోకలను నిలిపివేస్తారు. ఆర్టీసీ బస్సులు తిరగకపోవటంతో ప్రయాణికులు ఎండ్రాయి, చావపాడుల మీదుగా అంటే సుమారు 12 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి విజయవాడ వెళ్లాల్సి వస్తుంది. భారీ వర్షాలు కురిస్తే అది కూడా సాధ్యం కాదు. మండల పరిధిలోని వైకుంఠపురానికి వెళ్లడం కూడా కుదరదు.

ప్రతి ఏటా రైతులకు నష్టం

వాగుల పరీవాహక గ్రామాలైన అమరావతి, ఎండ్రాయి, ఎనికపాడు, నరుకుళ్లపాడు, పెదమద్దూరు, చావపాడు, వైకుంఠపురం గ్రామాల రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారు. వాగు పొంగితే సుమారు వారం నుంచి 15 రోజులపాటు పంటలు నీటిలోనే ఉంటాయి.

నిలిచిన కొత్త వంతెన నిర్మాణం

మేళ్లవాగుపై 2008వ సంవత్సరం ఆగస్టు 10వ తేదీన జరిగిన ప్రమాదంలో 23 మంది జలసమాధి అయ్యారు. ఆ సమయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్ రాజశేఖరరెడ్డి మేళ్లవాగు, కొండవీటివాగులపై హైలెవల్ వంతెనల నిర్మాణానికి ఇచ్చిన హామీ ఇచ్చారు. ఆ మేరకు హైలెవల్ వంతెనల నిర్మాణం జరిగింది. పెదమద్దూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం అప్పట్లో వీలు పడకపోవటంతో వాయిదా పడింది. 2022లో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషితో రూ.44.18 కోట్ల వ్యయంతో హైలెవల్ వంతెన నిర్మాణానికి అప్పటి గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు 60శాతం పూర్తయ్యాయి. ప్రభుత్వం మారటంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.



ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వాగు వంతెన రోడ్డు

అధికారులకు నివేదిక పంపాం

పెదమద్దూరు వాగుపై లో లెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. కాంట్రాక్టరుకు చెల్లింపులు జరగలేదు. ప్రస్తుతం లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరటంతో రాకపోకలు నిలిపి వేశాం. ఇటీవల వచ్చిన వరదలకు వంతెనపై రోడ్డు ధ్వంసమైంది. మరమ్మతులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. వీలైనంత త్వరలో మరమ్మతులు చేస్తాం

–కృష్ణారెడ్డి, డీఈ, రోడ్డు, భవనాల శాఖ, సత్తెనపల్లి

వంతెన పనులు పూర్తి చేయాలి



ప్రతి ఏడాదీ వాగు పక్క పొలాలు మునిగిపోతున్నాయి. భారీ వర్షాలు కురిసినా, కృష్ణానదికి వరద వచ్చినా వాగు పొంగి చప్టాపై మూడు, నాలుగు రోజులు నీరు ప్రవహిస్తోంది. అమరావతికి రాకపోకలు లేక ఇబ్బంది పడుతున్నాం. వాగు పొంగితే చుట్టూ నీరు వస్తుంది. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి కష్టాలు తీర్చాలి.

–రమావత్ రామకృష్ణనాయక్, మాజీ సర్పంచి, పెదమద్దూరు

వాగు పొంగితే కష్టమే..



నిత్యం వివిధ పనులపై అమరావతి వెళుతుంటాం. పెదమద్దూరు వాగు పొంగి చప్టా పైకి నీరు వస్తే రెండు, మూడు రోజులు రాకపోకలు నిలిచిపోతాయి. ప్రస్తుతం కృష్ణానదికి వచ్చిన వరదల వల్ల నిత్యావసర వస్తువులు తెచ్చుకోవటానికి 12 కిలోమీటర్లు ప్రయాణించి తుళ్లూరు వెళుతున్నాం. కూరగాయలు, పాల వ్యాపారులు వారం రోజులుగా అమరావతి వెళ్లేందుకు వీలులేక తీవ్రంగా నష్టపోయారు.

–గుబ్బా వెంకటేశ్వరరావు, రైతు, వైకుంఠపురం



నిర్మాణ దశలో ఉన్న నూతన బ్రిడ్జి



శిథిలావస్థలో వంతెన అడుగు భాగం(ఫైల్)



రోడ్లు భవనాల శాఖ ఏర్పాటుచేసిన రాకపోకల నిషేధ బోర్డు

భావితరాలకు తెలుగు పద్యం అందించాలి



నరసరావుపేట ఈస్ట్: తెలుగు పద్యం, అవధాన ప్రక్రియను భావితరాలకు అందించాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై ఉందని కొప్పరపు కవుల సాహితీ పురస్కార గ్రహీతలు పేర్కొన్నారు. శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి కళాపీఠం, శ్రీనరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో శ్రీశృంగేరి శంకరమఠంలోని శ్రీ భారతీ తీర్థస్వామి కళావేదికలో అవధాన కళా కేళి సాహితీసభ, కొప్పరపు సీతారామప్రసాదరాయకవి శత వసంతోత్సవం, అవధాని ప్రక్రియ నిర్వహించారు. కొప్పరపు కవుల వంశీకుడు మా శర్మ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ద్విభాషా ద్విశతావధాని పాలడుగు శ్రీచరణ్, ద్విశతావధాని బులుసు అపర్ణలకు కొప్పరపు సాహితీ పురస్కారంతో సత్కరించారు. గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాదు, శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాదులను సత్కరించారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ కొప్పరపు కవుల ధారణను ఇప్పటి వరకు అందుకున్న సాహితీవేత్తలు లేరనీ, ఇకముందు రారని తెలిపారు. ఇతర భాషా ప్రక్రియలలో లేని అవధాన ప్రక్రియను భావితరాలకు అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కొప్పరపు కవులు ఆసువుగా దాదాపు 8లక్షల పద్యాలను చెప్పారనీ, ఇవి లెక్కకు వచ్చినవి మాత్రమేనన్నారు. కొప్పరపు కవుల పలుకు పద్యంగా రాణించిందని కొనియాడారు. నటుడు, కవి డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ కొప్పరపు కవుల పద్యాలను గానం చేసి అలరించారు. పాలడుగు శ్రీచరణ్ నిర్వహించిన అవధానం ఆకట్టుకుంది. అవధాన సంచాలకులుగా శతావధాని పాలపర్తి శ్యామలానందప్రసాద్ వ్యవహరించాగా పృచ్ఛకులుగా డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి (నిషిద్ధాక్షరి), డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు (సమస్య), పోలూరి వెంకటశివరామప్రసాదరావు (దత్తపది), డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి (వర్ణన), డాక్టర్ వేదాన్తం సత్యశ్రీనివాస అయ్యంగార్ (న్యస్తాక్షరి), డాక్టర్ కె.వి.కోటయ్య (ఆశువు), డాక్టర్ నారాయణం వెంకటరాంబాబు (పురాణం), రత్నాకరం రాము (అప్రస్తుత ప్రసంగం)తో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జస్టిస్ ఎన్‌ఆర్ఎల్ నాగేశ్వరరావు, కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, అధ్యక్షుడు శ్రీగిరిరాజు అయ్యపరాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు
- జాబ్ మేళాలో 66 మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది

నరసరావుపేటఈస్ట్: యువత తమ విద్యార్హతకు తోడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవటం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని స్కిల్ హబ్, మాచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో రిలయన్స్ రిటైల్, టాటా కాపిటల్, పేటీఎం వంటి ఎనిమిది కంపెనీలు పాల్గొన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 123 మంది హాజరు కాగా, కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి 66 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ అభ్యర్థుల నైపుణ్యాలను, మెళుకువలను పెంపొందించుకునేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.బాలునాయక్, ఎంప్లాయ్‌మెంట్ జేఈఓ రమాదేవి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్లు ఎం.వీరాంజనేయులు, జె.సురేష్, జిల్లా సీడాప్ పీఓ నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయలో ప్రవేశాలకు ఆహ్వానం

నకరికల్లు: జవహర్ నవోదయ విద్యాలయాల్లో చేరగోరే విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ఎస్.ప్రసాద్ సూచించారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ఐదోతరగతి చదువుతూ ఉండాలన్నారు. మూడు, నాలుగో తరగతులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 1 మే 2013 నుండి 31జులై 2015 మధ్య పుట్టిన వారై ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మూడో వంతు సీట్లు బాలికల కోసం కేటాయింపు ఉందన్నారు. 18 జనవరి 2025 న, 12 ఏప్రియల్ 2025న ప్రవేశపరీక్షలు నిర్వహించబడతాయన్నారు. వివరాల కోసం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయం, 9901009587, 9866660593, 9494676751 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

179 బాటిళ్ల తెలంగాణ మద్యం పట్టివేత

బెల్లంకొండ: తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఆదివారం రాత్రి సమయంలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజా తెలిపారు. మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం తీసుకొస్తున్నారని సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. పాపాయపాలెం గ్రామ సమీపంలో పిల్లేరు వాగు వద్ద మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం తరలిస్తున్న రాంబాబు, పెద్దోడులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 179 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి, సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ వర్గీయుల దాడి

- వినాయక మండపంపై కర్రలు, రాళ్లతో దాడి
- కారు ధ్వంసం.. పలువురికి గాయాలు



విద్యుత్ దీపాలంకరణను ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీ వర్గీయుల చవితి మండపంపై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

నరసరావుపేట రూరల్ : వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పడిన స్వల్ప వివాదం పల్నాడు జిల్లా జొన్నలగడ్డలో ఉద్రిక్తతకు దారితీసింది. వినాయక విగ్రహం ఊరేగింపు సందర్భంగా ఆదివారం రాత్రి బాణసంచా కాల్చారు. కాలనీలోని వైఎస్సార్‌సీపీకి చెందిన కొందరు తమ ఇళ్ల ముందు కాల్చొద్దని చెప్పారు. దీంతో స్వల్ప వివాదం మొదలైంది. పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పడంతో ఊరేగింపు ముందుకు కదిలింది. గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో టీడీపీ వర్గీయుల విగ్రహ నిమజ్జనం కూడా అదే సమయంలో జరుగుతుండటంతో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాణాసంచా కాల్చడానికి వైఎస్సార్‌సీపీ వర్గీయులు అభ్యంతర వ్యక్తం చేశారన్న సమాచారం తెలియడంతో యువకులు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఏర్పాటు చేసిన చవితి పందిరిపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. విద్యుత్ అలంకరణలను ధ్వంసం చేశారు. మండపం సమీపంలో నిలిపి ఉంచిన కారును కూడా ధ్వంసం చేశారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పలువురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ కిశోర్ సిబ్బందితో అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అయితే టీడీపీ నాయకులు దాడి చేస్తే వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం.

మైనర్ బాలికతో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

తాడికొండ: మైనర్ బాలికతో వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన తాడికొండ మండలం పొన్నెకల్లులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన కన్నెబోయిన తిరుపతయ్య(77)ఇంటికి సమీపంలోని పదేళ్ల బాలికను లోపలకు పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన తల్లిదండ్రులు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వాసు తెలిపారు. నిందితుడు గతంలో కూడా మైనర్‌పై అసభ్య ప్రవర్తన కేసులో ఐదు సంవత్సరాల శిక్షపడి ఇటీవలే జైలు నుంచి వచ్చాడు. తిరిగి బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రాజుపాలెంలో ఇరువర్గాల ఘర్షణ

వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురికి, టీడీపీకి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు

బెల్లంకొండ: వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులను పార్టీ పేరుతో, కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించడంతో అలా తిట్టడం సరికాదని, తిరిగి వారు కూడా మిమ్మల్ని అలాగే తిడతారని చెప్పడంతో మాటామాటా పెరిగి ఇరువర్గాలు దాడులు చేసుకున్న ఘటన మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మేకల ప్రసాద్, ప్రభాకరరావు, రాజు అనే ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా టీడీపీకి చెందిన రామకృష్ణ, గుంజా శివ అనే ఇద్దరు గాయపడ్డారు. బాధితులు మేకల ప్రసాద్, ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రామకృష్ణ ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులను దుర్భాషలాడుతుండడంతో అలా మాట్లాడడం కరెక్ట్ కాదని, తిరిగి అదే మాటలు మిమ్మల్ని కూడా అంటారని అనడంతో వాదన జరిగింది. అది మనసులో పెట్టుకున్న టీడీపీ నాయకులు సోమవారం రాత్రి సమయంలో రెచ్చగొట్టి గొడవకు దిగారు. గొడవ కాస్తా మాటామాటా పెరిగి ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసి దాడులు చేసుకునే వరకు వెళ్లింది. ఇరువర్గాలు కర్రలు, రాడ్లతో దాడులు చేసుకోవడంతో వైఎస్సార్‌సీపీ చెందిన ముగ్గురికి, టీడీపీకి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజా గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడిన వారిని సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని లక్షలు తీసుకొని మోసం

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీకి విన్నవించిన బాధితులు
- తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాల సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించారు.



బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

డబ్బులు అడిగితే చంపుతాననంటున్నాడు

వినుకొండ పట్టణానికి చెందిన ఎ.నరసింహారావు వీఆర్వో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నమ్మించి రూ.10లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, తిరిగి డబ్బులు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు.

–ఎస్.వెంకటేశ్వర్లు, వినుకొండ

రెండేళ్ల నుంచి రిజిస్టర్ చేయట్లేదు

నేను రెండేళ్ల కిందట నకరికల్లు వద్దనున్న భూమిని ఓ వ్యక్తి వద్ద రూ.38లక్షలు ఇచ్చి కొనుగోలు చేశాను. రెండేళ్లు అయినా రిజిస్టర్ చేయట్లేదు. ఆ వ్యక్తి పదే పదే తిప్పించుకుంటూ ఇబ్బందిపెడుతున్నాడు.

–కె.రాధా, నరసరావుపేట పట్టణం

డబ్బులు చెల్లించాలని వేధిస్తున్నాడు

నా కుటుంబ ఖర్చుల కోసం ఇంటిని తాకట్టుపెట్టి ఒక వ్యక్తి వద్ద డబ్బులు తీసుకున్నా. సోమనాథ్ అనే వ్యక్తి నీ ఇంటిపై బ్యాంకు నుంచి రుణం ఇప్పిస్తానని నమ్మబలికి తాకట్టు పత్రాలను తీసుకున్నాడు. మళ్లీ నాచేత ఆ ఇంటిపై రూ.లక్ష ఖర్చు చేయించాడు. రుణం ఇప్పించకపోగా రూ.4.5లక్షలతోపాటు మరో రూ.లక్ష వడ్డీ ఇవ్వాలంటూ వేధిస్తున్నాడు. ఫోన్‌చేసి డబ్బులు ఇవ్వకపోతే చంపుతానంటూ కులం పేరుతో దూషించి బెదిరిస్తున్నాడు. పోలీసులకు ఫిర్యాదుచేసినా చర్యలు శూన్యం. మీరైనా నా ఇంటి కాగితాలు ఇప్పించి అతడి నుంచి నాకు రక్షణ కల్పించండి.

–ఎం.కోట్యానాయక్, చల్లగుండ్ల అడ్డరోడ్డు, నకరికల్లు

ఆన్‌లైన్‌లో పొలం ఎక్కించుకొని బెదిరిస్తున్నాడు

నాకు గ్రామంలో 1.25 ఎకరాల పొలం ఉంది. ఆ భూమిని బాల వెంకటసుబ్బయ్య అనే అతను ఆన్‌లైన్‌లో తన పేరుపై ఎక్కించుకున్నాడు. ఈ విషయం గురించి అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు.

–వై.సుబ్బారావు, వితంరాజుపల్లి, వినుకొండ మండలం

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ గుంటూరు – చిలకలూరిపేట, NH-16 గణపవరం, పాత TB హస్పిటల్ ప్రక్కన తూర్పు ఫేసింగ్‌తో ల్యాండ్ కన్వర్షన్ అయిన 50 సెంట్ల స్థలం అమ్మబడును. (132 వెడల్పు –165 పొడవు) సంప్ర ✆ 8178659485

SERVICES

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ బిజినెస్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీలోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7015882322

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED

■ ప్రముఖ ఆఫీసు గుంటూరు నందు పని చేయుటకు స్టాఫ్, టెలికాలర్స్, మార్కెటింగ్, మహిళలు, డ్రైవర్లు పురుషులు కావలెను. సంప్ర ✆ 6305122386

■ తెనాలి & కారంపూడిలలో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు అనుభవం గల కంప్యూటర్ ఆపరేటర్ M/F కావలెను. ఆకర్షణీయమైన జీతం ✆ 8686935606

■ గుజ్జనగుండ్ల, నల్లపాడు, పేరేచర్లలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జంటుగా కావలెను. మరియు మంగళగిరి ఏరియాలో మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను ✆ 7386743664, 7386585846

■ శ్రీ లక్ష్మీ హోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17,000/- రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు అనుభవం గల సైట్ ఇంజినీర్స్(M) కావలెను. అ: ITI, డిప్లొమా, (సివిల్), డిగ్రీ, సంప్ర: 9346566955

■ క్లాసు ఇన్‌చార్జ్‌లు, హాస్టల్ ఇన్‌చార్జ్‌లు, వార్డెన్లుగా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతం రూ॥ 10000/- నుండి 12000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనం, వసతి ఇవ్వబడును. విద్యార్హతలు: SSC Above పనిచేయు స్థలం: గుంటూరు. మాస్టర్‌మైండ్స్. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 91000 24059

■ Montessori E.M School Gnt wanted experienced & qualified English Medium Teachers & P.E.T. 6305028254

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 77024 73949

■ Wanted Male and Female work for MNC company Qul 10th to degree sal 15k to 25k Cont: 9030612463 (Work from Home available)

■ Wanted Girls aged 18-24 years to work as sales girls in a Jewellery Showroom, fruit market, Lalapet, Guntur ✆ 9700311201

■ గుంటూరులో ఫ్లేవర్స్ ఓషన్ ఐస్‌క్రీమ్ కంపెనీ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డీలర్స్ కావలెను. అర్హత, అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ✆ 9032575249

■ టీమ్‌లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal + Inc 40 వేలు. వ: 30 to 65 Q: 10th+, రిటైర్డ్, వ్యాపారస్తులు, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, మార్కెటింగ్. Ph: 99666 34511

■ PAPARAO HIGH SCHOOL, K.UPPALA PADU, Prakasam (Dt.) Wanted High School Social teacher & Primary Teachers (Female) in all Subjects. & Lady Wardens also. Free Boarding & Lodging. Salary Negotiable ✆ 70193 26579, 80086 22210.

■ నరసరావుపేట దగ్గర, ప్రముఖ ఆక్వా కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ విభాగం నందు పనిచేయుటకు B.SC కెమిస్ట్రీ డిగ్రీ కలిగిన యువకులు కావలెను. బయోడేటా పంపవలసిన Mail Id:admin@valvin.in ఇంటర్వ్యూ తేది 10-09-2024 ✆ 96639 09856, 94414 84802

■ విజయవాడలో సంపన్నుల / పెద్దవారి ఇళ్ళ వద్ద ఉండి, పేషెంట్లని / Bed Ridden వారిని చూసుకొనుటకు అనుభవం గల బేబీ టేకర్స్ M/F నర్సులు, RMPలు కావలెను. ✆ 91608 35559, 96850 25559

■ Raj Agency Vijayawada: Financial company wants to field Collection executives in Sattenapalli, Narasaraopet & Chilakaluripet. Slry + Inc. 63004 90073, 99499 72701.

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయటానికి కార్గో సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, క్యాబ్ డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 28000 నుండి 34000 రూము + భోజనం ఫ్రీ. Ph: 9133671684

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640528899, 9640648899

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.